జగనన్న ఆరోగ్య సురక్షతో భరోసా

పామిడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పేదల ఆరోగ్యానికి భరోసా ఇస్తోందని సర్పంచ్ కోటంక సుజాత అన్నారు. మంగళవారం కండ్లపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె ప్రజల ఆరోగ్యమే పరమావధిగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా ఎద్దులపల్లి ప్రాథమిక వైద్యాధికారి ఉదయార్క ఆధ్వర్యంలో వైద్యులు నితిన్‌కుమార్ రెడ్డి, వీ సుధాకర్, వెంకటరమణ 507 మందికి వివిధ వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని డీపీఎంఓ డాక్టర్ రవికుమార్ పర్యవేక్షించారు.

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంతాలలో నిరుపేదల ఇంటి వద్దకే మెరుగైన వైద్యం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఎంపీపీ సునీత పేర్కొన్నారు. మంగళవారం కొర్రపాడు–2 గ్రామంలో సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. వివిధ విభాగాల వైద్యుల ద్వారా పేదలకు వైద్య పరీక్షలు చేయించడంతో ఉచితంగా మందులు పంపిణీ చేసేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఈసందర్భంగా 464 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ వినోద్ కుమార్, సీహెచ్‌ఓ మోహన్ బాబు, హెల్త్ సూపర్‌వైజర్ కేశవయ్య, శ్రీదేవి, రమేష్‌కుమార్, రమ్య, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




బీకేఎస్ మండలం కొర్రపాడులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్, పామిడి మండలం కండ్లపల్లిలో వైద్యపరీక్ష చేస్తున్న దృశ్యం

పుట్లూరు: మండలంలోని కుమ్మనమలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్రీవాణీతో పాటు పలువురు వైద్యులు కుమ్మనమల సచివాలయ పరిధిలోని 300 మందికి వైద్య పరీక్షలు చేశారు. కుమ్మనమల, తురకవారిపల్లి, కొత్తపల్లి, కొండుగారికుంట, రంగమనాయునిపల్లి, రంగరాజుకుంట గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

యాడికి: ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని నం:1 సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 420 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచు అనూరాధ, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీ నాగరాజు, యాడికి పీహెచ్‌సీ వైద్యులు శ్రీరాంకుమార్, పరమేశ్వర్, అనంతపురం వైద్యనిపుణులు మీనాక్షి, శ్రీనివాసులు రెడ్డి, కంటి వైద్య నిపుణుడు మధుసూదన్ రాజు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గార్లదిన్నె: కోటంక గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి ఓబులు పరిశీలించారు. అనంతరం 406 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ విజయ భాస్కర్, పీహెచ్‌సీ డాక్టర్లు గౌతమి, దిలీప్, స్పెషల్ డాక్టర్లు హరిక్రిష్ణ, ప్రసాద్, మహతి, సీహెచ్‌ఓ లోక్‌నాథ్, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరరావు, పీహెచ్‌ఎన్ అరుణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పుట్లూరు మండలం కుమ్మనమల గ్రామంలో మందులు అందిస్తున్న వైద్య సిబ్బంది



యాడికిలో మెడికల్ రిపోర్టులు అందజేస్తున్న వైద్యులు

జగనన్నను ఆశీర్వదించండి

తాడిపత్రి అర్బన్: కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్న సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి కోరారు. మంగళవారం ఉదయం పట్టణంలోని 32వ వార్డులో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా సాయిప్రతాప్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. పేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న వైఎస్.జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జావిద్‌ఖాద్రీ, వక్ఫ్‌బోర్డు కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, నాయకులు పేరం ఆది, రాజేష్ తదితరులు ఉన్నారు.

తాడిపత్రిటౌన్: వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ కి ఓటు వేసి సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించుకుందాని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి అన్నారు. తలారి చెరువు గ్రామంలో ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఓబులరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరెడ్డి, నాయకులు ఆలూరు రామేశ్వరెడ్డి, హరినాథరెడ్డి, సంజీవరెడ్డి, క్రిష్ణమూర్తిరెడ్డి, బాకర్ వలి, హాజీ బాషా, గౌస్, సుజిత్‌కుమార్‌రెడ్డి, పక్ఱుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్.జగన్‌ను ఆశీర్వదించాలని కోరుతున్న సాయిప్రతాప్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో ఊరు దేవర

గుత్తి రూరల్: ధర్మాపురం, జక్కలచెరువు గ్రామాల్లో మంగళవారం ఊరు దేరవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వేకువజాము నుంచి పెద్దమ్మ, సుంకులమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలను తలపై ఉంచుకొని ఆలయం వరకూ ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌యాదవ్, రంగస్వామి, రాజన్న, రామరంగారెడ్డి, గోపాల్‌రెడ్డి, అరటి పండ్ల చంద్ర, కౌన్సిలర్ వరదరాజులు, సర్పంచ్‌లు చంద్ర, సుహాసిని ఆయా ఆలయాల్లో పూజలు చేశారు.

గార్లదిన్నె: కనంపల్లిలో మంగళవారం ఊరు దేవరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పెద్దమ్మ, నల్లమ్మ అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజ లు చేశారు. సోమవారం రాత్రి అమ్మవారి ఊరేగింపు చేసి, అమ్మవారి రథోత్స వం నిర్వహించి పానకాలు సమర్పించారు. అర్ధరాత్రి జంతు బలి కార్యక్రమం నిర్వ హించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు సమర్పించారు. గ్రామంలో మిఠాయి, గాజులు, వివిధ తినుబండారాల అంగళ్లతో సందడి నెలకొంది.



గుత్తి మండలం జక్కలచెరువులో పూజలందుకున్న పెద్దమ్మ తల్లి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: కొత్తపేట గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం బైక్‌పై నుంచి పడి ఓ వ్యక్తి గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. టి.కొత్తపల్లి గ్రామానికి చెందిన శివన్న గుత్తిలో పని ముగించుకుని ఇంటికి బయలుదేరాడు. కొత్తపేట గ్రామ శివారులో అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో గాయపడిన అతడిని స్థానికులు 108లో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జారి పడి ఒకరికి గాయాలు..

కర్నూలు జిల్లా తుగ్గలి మండలం చెరువు తండాకు ఓ వ్యక్తి మంగళవారం ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. చెరువు తండాకు చెందిన నాగరాజు నాయక్ ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు మెట్లు దిగుతుండగా కాలుజారి కిందపడ్డాడు. ప్రమాదంలో తలకు బలమైన గాయమైంది. తీవ్ర రక్తస్రావంతో పడి ఉన్న అతడిని కుటుంబసభ్యులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురం తీసుకెళ్లారు.

అంకాలమ్మ, కుంటెమ్మ జాతర ప్రారంభం



పూజలందుకున్న అంకాలమ్మ, కుంటెమ్మ దేవతలు



రాతిదూలం లాగుతున్న వృషభాలు

పామిడి: పట్టణంలోని కొండూరురోడ్డులో వెలసిన అంకాలమ్మ కుంటెమ్మ 16వ జాతర మంగళవారం ప్రారంభమైంది. ఈసందర్భంగా గ్రామస్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దేవతామూర్తులను వెండి, బంగారు ఆభరణాలు, సుగంధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వెలిసిన అంగళ్లకు మంచి గిరాకీ లభించింది. పిల్లలు ఊయలు ఊగుతూ, జారుడు బండపై జారుతూ సరదాగా గడిపారు. మధ్యాహ్నం మంగళహారతి అనంతరం అన్నదానం నిర్వహించారు.

అట్టహాసంగా రాతిదూలం లాగుడు పోటీలు

అంకాలమ్మ, కుంటెమ్మ గ్రామదేవతల 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం రాతిదూలం లాగుడు పోటీలు ప్రారంభమయ్యాయి. పాలపళ్ల విభాగంలో అనంతపురం, కర్నూలు జిల్లాలకు చెందిన 10 జతల వృషభాలు పాల్గొన్నాయి. కర్నూలు జిల్లా కోడుమూరుకు చెందిన రైతు బీ రామలింగేశ్వరస్వామి వృషభాలు మొదటి స్థానం, అదేజిల్లా రుద్రవరానికి చెందిన రైతు రాముడు వృషభరాజులు రెండు, మూడో స్థానం, అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం పెనకచెర్లకు చెందిన రైతు జీ రాజశేఖర్‌రెడ్డి వృషభరాలు నాలుగు, నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన రైతు టీ శ్రీను వృషభరాలు ఐదో స్థానంలో నిలిచాయి. వృషభాల యజమానులకు వరుసగా రూ. 30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5వేలు చొప్పున నగదు బహుమతితో ప్రోత్సహించారు. బుధవారం న్యూకేటగిరి విభాగంలో పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తిని అలవర్చుకోవాలి



జాతీయ గీతాలాపనలో పాల్గొన్న జూనియర్ సివిల్ జడ్జి చంద్రశేఖర్‌రెడ్డి



గుత్తిలో సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తాడిపత్రి అర్బన్: ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి ఎం.చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. మంగళవారం స్వాతంత్య్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సామూహిక జాతీయగీతాలాపన చేశారు. ఉదయం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, యల్లనూరు రోడ్డు సర్కిల్, మహాత్మా గాంధీ సర్కిల్, అశోక్‌పిల్లర్, గాంధీకట్ట వద్ద సామూహిక జాతీయ గీతాలాపన చేశారు. ఈసందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మొట్టమొదటి సారిగా రాష్ట్ర చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా తాడిపత్రిలో సామూహికంగా జాతీయ గీతాలాపాన చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రజల్లో సమైక్యత, సద్భావన, దేశభక్తి, జాతీయత భావం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడుతాయన్నారు. ఎంఈఓ నాగరాజు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి సుబ్రమణ్యం, జాతీయగీతాలాపన కమిటీ చైర్మన్ కిశోర్‌కుమార్, రోటరీ క్లబ్ సభ్యులు కుళ్ళాయిస్వామి, విసి.మద్దిలేటి, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

గుత్తి: మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద మంగళవారం కాపు సంక్షేమ సేన నాయకుల ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వారు సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాపు సంక్షేమ సేన గుత్తి మండలాధ్యక్షుడు మారాకుల రమణ, ఉపాధ్యక్షుడు బీఎన్ మంజునాథ్ మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ స్వాతంత్య్ర ఉద్యమంలో బ్రిటిషర్స్‌కు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. ప్రతి భారతీయుడు నేతాజీని ఆదర్శంగా, స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాపు సంక్షేమ సేన నియోజకవర్గం అధ్యక్షుడు రంగా రాయల్, సీనియర్ నాయకులు పగడాల శ్రీనివాసులు, రామాంజనేయులు, చిరంజీవి, ఈశ్వర్ రాయల్, రాము, శ్రీకరం వెంకటేష్, హరీష్ రాయల్, వెంకటరామిరెడ్డి, శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జేవీవీ నాయకులు నేతాజీ జయంతి వేడుకలు నిర్వహించారు.

నేడు సర్వసభ్య సమావేశం

తాడిపత్రిటౌన్: ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రంగారావు తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పెద్దపప్పూరు: ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ మంగళవారం తెలిపారు. అధికారులతో పాటు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

చురుగ్గా కుల గణన

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం కుల గణన సర్వే చురుగ్గా సాగింది. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు, వార్డు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి కుల గణన చేపట్టారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్రా’ జయప్రదం చేయండి

శింగనమల : శింగనమలలో బుధవారం నుంచి జరిగే నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలను జయప్రదం చేయాలని ఎంపీడీఓ నిర్మలా కుమారి కోరారు. మంగళవారం ఆమె ఎమ్మార్సీ భవనంలో పీడీలు, పీఈటీలతో సమావేశం నిర్వహించారు. బుధవారం పురుషులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు, 25న మహిళలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించాలన్నారు. అలాగే 25 నుంచి 27 వరకు పురుషులు, 29 మహిళల క్రికెట్ పోటీలను నిర్వహించాలన్నారు. పోటీలలో శింగనమల, గార్లదిన్నె, నార్పల, పుట్లూరు, బుక్కరాయసముద్రం, యల్లనూరు మండలాల నుంచి 60 టీంలు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఎంఈఓలు నరసింహరాజు, శివప్రసాద్‌లు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ నిర్మలాకుమారి

‘వైఎస్సార్ ఆసరా’ నిధుల విడుదల

శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకం కింద మంగళవారం ఉరవకొండలో నాలుగో విడతను నిధులు విడుదల చేశారు. శింగనమల నియోజకవర్గంలో 4,831 మహిళ సంఘాలకు దాదాపు 48 వేల మంది మహిళల ఖాతాల్లోకి రూ.42.41 కోట్లు జమ కానున్నట్లు ఏపీఎం నారాయణస్వామి తెలిపారు. బుక్కరాయసముద్రం మండలంలో 1,046 సంఘాలకు రూ.9.42 కోట్లు, గార్లదిన్నె 928 సంఘాలకు రూ.7.65 కోట్లు, నార్పల 1,055 సంఘాలకు 9.49 కోట్లు, పుట్లూరు 588 సంఘాలకు రూ.4.51 కోట్లు, శింగనమల 624 సంఘాలకు రూ.5.35 కోట్లు, యల్లనూరు మండలంలో 590 సంఘాలకు రూ.5.99 కోట్లు జమవుతాయన్నారు.

అధ్యాపకులకు శిక్షణ

గుంతకల్లుటౌన్: స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ కళాశాలల లెక్చరర్స్‌కు మూడురోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం ప్రారంభమైన కార్యక్రమంలో భావోద్వేగ అభ్యాస ప్రక్రియ(సీక్), స్వీయ బోధనా పద్ధతులపై అధ్యాపకులకు రిసోర్స్ పర్సన్లు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన అధ్యాపకులు ఆయా కళాశాల్లోని విద్యార్థులకు డిగ్రీ కోర్సులతో పాటు భవిష్యత్తులో ఉద్యోగవకాశాలకు వెళ్లినప్పుడు రాతపరీక్షలు, ఇంటర్వ్యూల్లో ఎలా రాణించాలో వివరించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య తెలిపారు. రాయదుర్గం, ఉరవకొండ, తాడిపత్రి, డోన్, పత్తికొండ, ఎమ్మిగనూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



పక్కీరమ్మకు నగదు అందిస్తున్న సర్పంచ్ ప్రమీలమ్మ

పామిడి: నీలూరు గ్రామానికి చెందిన మృతుడు రామకృష్ణ తల్లి పక్కీరమ్మకు మంగళవారం వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద రూ.10 వేలను సర్పంచ్ బెల్లాల ప్రమీలమ్మ అందజేశారు. రామకృష్ణ విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా సంయుక్త కార్యదర్శి బెల్లాల రమణారెడ్డి, ఉప సర్పంచ్ జయన్న, వలంటీర్లు హరినాథ్‌రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం

గుంతకల్లుటౌన్: మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ మల్లికార్జున మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్, కోఆప్షన్‌సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొనాలని కోరారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన తలారి చెరువు గ్రామస్తులు

తాడిపత్రిటౌన్: తలారి చెరువులో బుధవారం ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామానికి చెందిన కడితం అమర్‌నాథ్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, తరుణ్ కుమార్‌రెడ్డి, సురేష్‌కుమార్‌కు ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై పార్టీలోకి చేరినట్లు తెలిపారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పారని, గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు తదితర అభివృది పనులు చేపడుతూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



సిద్ధరాచర్లలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

నార్పల: ఆధునిక పద్ధతులతో వ్యవసాయం చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం రెడ్డిపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు చందన, శశికళ పేర్కొన్నారు.మంగళవారం సిద్దరాచర్ల గ్రామంలో వారు రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. గ్రామీణ పటం, కాలక్రమం, బార్ గ్రాఫ్, ప్రాబ్లమ్ ట్రీ అనాలసిస్, సీజనల్ క్యాలెండర్, మ్యాట్రిక్స్ ర్యాకింగ్ తదితర వాటిని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ మార్పులతో వ్యవసాయంలో లాభాలు రావాలంటే ఆధునిక పద్ధతులు పాటించాలన్నారు. ప్రతి రైతు పకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. బద్వేలు ఎస్వీఆర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

మాదిగల మహా సమ్మేళనం కరపత్రాల విడుదల

పామిడి: పట్టణంలో మంగళవారం ఈనెల 31న జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో జరిగే మాదిగల మహా సమ్మేళన కరపత్రాలను ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సాకే ఓబులేసు విడుదల చేశారు. మాదిగల రాజ్యాధికారం, హక్కుల సాధనకు కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమానికి మండలవ్యాప్తంగా ఉన్న మాదిగలు తరలిరావాలని కోరారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఇద్దరు విద్యార్థుల ఎంపిక



జ్ఞానేష్



సతీష్

యాడికి: నగరూరు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ ఎంపికై నట్లు హెచ్‌ఎం కుళ్లాయప్ప మంగళవారం తెలిపారు. గతేడాది డిసెంబర్‌లో జరిగిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో జ్ఞానేష్, సతీష్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారన్నారు. విద్యార్థుల ఎంపికకు కృషి చేసిన శ్రీనివాసులు, నరేంద్రారెడ్డి ఉపాధ్యాయులను హెచ్‌ఎం కుళ్లాయప్ప అభినందించారు.

సీఎం సభకు తరలివెళ్లిన జనం



పామిడి మండలం నుంచి బస్సులో వెళ్తున్న జనం

పామిడి: ఉరవకొండలో మంగళవారం నిర్వహించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు పామిడి మండలం నుంచి వేలాది మంది తరలివెళ్లారు. గుంతకల్లు ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ మండల నాయకులు, పట్టణ, రూరల్ కన్వీనర్లు జోజోడీ కుమార్, కే నారాయణరెడ్డి, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూధన్‌రెడ్డి తదితర నాయకుల ఆధ్వర్యంలో బస్సులు, జీపులుర, కార్లు, బైకుల్లో పెద్ద ఎత్తున బయలుదేరారు.

యల్లనూరు: ఉరవకొండలో మంగళవారం జరిగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు మండలం నుంచి భారీగా ప్రజలు తరలివెళ్లారు. జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు ఈశ్వరరెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షులు పురుషోత్తం నాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న సీడీపీఓ ఢిల్లీశ్వరి

గుత్తి: స్థానిక స్వీపర్స్ కాలనీ, ఈద్గా , బ్రాహ్మణ వీధి అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం సీడీపీఓ ఢిల్లీశ్వరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లోని అన్ని రకాల రికార్డులను పరిశీలించారు. సమయపాలన పాటించాలని అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు గంగా, గౌసియా పాల్గొన్నారు.

బాలామృతం పంపిణీ



పద్మనాభయ్య ఫ్యాక్టరీ అంగన్‌వాడీ కేంద్రంలో బాలామృతం అందిస్తున్న దృశ్యం

గుత్తి: పద్మనాభయ్య ఫ్యాక్టరీ అంగన్వాడీ కేంద్రం, స్వీపర్స్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంతో పాటు పలు అంగన్వాడీ కేంద్రాల్లో మంగళవారం లబ్ధిదారులకు బాలామృతం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి మాట్లాడుతూ చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం బాలామృతం పంపిణీ చేస్తోందన్నారు. అంగన్వాడీ టీచర్లు నాగలక్ష్మి, గంగా తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే వైవీఆర్ రాక

పామిడి: గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి బుధవారం పట్టణానికి రానున్నారు. ప్రముఖ శైవ క్షేత్రమైన భోగేశ్వరాలయ పునర్నిర్మాణానికి భూమి పూజ చేయనున్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నేత మృతి

పామిడి: ఖాదర్‌పేట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత సీ రవికుమార్(48) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గౌరప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు రవికుమార్ మృతదేహం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విధుల్లో చేరిన తహసీల్దార్

యాడికి: తహసీల్దార్ బాలమ్మ మంగళవారం విధుల్లో చేరారు. డిసెంబర్‌లో అనారోగ్యంతో ఆమె సెలవులో వెళ్లారు. దీంతో ఉన్నతాధికారులు రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న రాజ్‌కుమార్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి: పట్టణంలో ఓ మహిళ విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించింది. వివరాలు.. ఉప్పర వీధికి చెందిన అరుణ అనే మహిళ మంగళవారం విషద్రావకం తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అయితే ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలిరాలేదు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడిపత్రి డివిజన్
9912220722, 9010223701
9912220732, 9010588846